క్లుప్తంగా

పెదపులిపాక ఆలయంలో అమ్మవారికి చండీహోమం



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఉన్న శ్రీ విజయరాజ రాజేశ్వరి శ్రీవిజయ సుందరేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ఆలయంలో గోపూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారికి చండీహోమం చేశారు. అమ్మవారికి భక్తులు లక్ష పుష్పార్చన చేశారు. సాయంత్రం అమ్మవారిని రథంపై గ్రామంలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవాసుదేవానందగిరి స్వామీజీ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా కార్మిల్ మాత పుణ్యక్షేత్ర మహోత్సవం



పెనమలూరు: కానూరులో మౌంట్ కార్మిల్ మాత మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నవదిన ప్రార్థనల్లో భాగంగా ఆదివారం రాత్రి పరిశుద్ధ జపమాల ప్రార్థనలు ఫాదర్ బొల్లి జయరాజ్, ఫాదర్లు పృథ్వి, మందా ప్రదీప్, సలివేంద్ర శౌరి, దేవదానం చేశారు. భక్తులు కొవ్వొత్తులతో ప్రార్థనలో పాల్గొన్నారు. భక్తులకు దివ్య ప్రసాదం అందజేశారు. అనంతరం లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపదేశకులు, యూనిట్ లీడర్లు, కౌన్సిల్ సభ్యులు, గంగూరు, కానూరు, కామయ్యతోపు, పోరంకి నుంచి దాదాపు 2వేల మంది భక్తులు పాల్గొన్నారు. గత తొమ్మిది రోజులుగా మేరీ మాత పుణ్యక్షేత్రంలో నిర్వహించిన మహోత్సవాలకు సహకరించిన వారికి ఫాదర్లు అభినందనలు తెలిపారు.

నేడు తేలప్రోలులో విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉంగుటూరు: తేలప్రోలు సబ్‌స్టేషన్ విద్యుత్ నిర్వహణలో భాగంగా తేలప్రోలులో మంగళవారం ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా మెయింటెనెన్స్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చుక్కపల్లి చారిటబుల్ ట్రస్టు వితరణ



గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చుక్కపల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు ప్రతినిధి చుక్కపల్లి సుధ సోమవారం 23 కుర్చీలు, మధ్యాహ్న భోజనానికి విద్యార్థులకు 150 ప్లేట్లు వితరణగా అందజేశారు. పాఠశాల హెచ్ఎం హరిచరణ్, ఉపాధ్యాయులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. దాతను పాఠశాల యాజమాన్యం శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సాజియాబేగం



గన్నవరం: మండలంలోని దావాజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ షేక్ ఫాతిమా సాజియాబేగం ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందినట్లు ప్రధానోపాధ్యాయురాలు వి.రజనీకుమారి తెలిపారు. పాఠశాలలో సోమవారం సాజియాబేగంతో పాటు ఆమె తల్లిదండ్రులను ఉపాధ్యాయ బృందం సత్కరించింది. ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యే విధంగా తనను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సాజియాబేగం కృతజ్ఞతలు తెలిపారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం దేవదాయ శాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, సేవాసమితి సభ్యుల పర్యవేక్షణలో జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభ మవుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో హుండీ లెక్కింపులో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు



కాటూరులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఆర్డీఓ విజయ్‌కుమార్



మాదలవారిగూడెంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ అనగాని రవి

ఉయ్యూరు: జగనన్న సురక్షతో ప్రజలకు మేలు జరుగుతుందని ఉయ్యూరు ఆర్డీఓ ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కాటూరు-1 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో 626 మంది లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆర్డీఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న సురక్షతో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఇంటి ముంగిటే సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ నాంచారరావు, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ మస్తాన్, ఎంపీటీసీ తోట శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పేద ప్రజల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సర్పంచ్ కట్టుబోయిన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. కుల, మత, రాజకీయ వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలకు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అనంతరం వలంటీర్ల సర్వేల్లో వచ్చిన 358 అర్జీలను పరిష్కరించి ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రత్యేక ఆధార్ శిబిరం నిర్వహించి 59 మంది ఆధార్ కార్డులకు ఫోన్ నంబర్లు లింక్ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యుడు చాకిరి వెంకట నారాయణ, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ తానీషా, పీఏసీఎస్ చైర్మన్ నాగార్జున, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేములు శ్రీను, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పంతం యోహాను, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.వెంకట రమణ, పంచాయతీ రాజ్ ఏఈ డి.జయరాజు, హౌసింగ్ ఏఈ డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

ఉంగుటూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందజేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శేష గిరిరావు తెలిపారు. వేంపాడు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అర్హత ఉండీ ఇంకా పథకాలు లబ్ధి పొందని వారిని వలంటీర్లు సర్వే ద్వారా గుర్తించి జగనన్న సురక్ష సభలో మంజూరు చేస్తున్నామని తెలిపారు. అనంతరం పలువురికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. 251మందికి కుల ధ్రువీకరణ, 167 మందికి ఆదాయ ధ్రువీకరణ, 55మందికి ఆధార్ మొబైల్ లింక్ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేంపాడు, చాగంటిపాడు సర్పంచులు ఎన్.శివనాగబాబు, ఎ.లక్ష్మి అనూష, సచివాలయ కన్వీనర్ నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ సోమేశ్వరరావు, నాయకులు బాల స్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల సమగ్రాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

గన్నవరంరూరల్: ప్రజల సమగ్రాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అనగాని రవి అన్నారు. మండలంలోని మాదలవారిగూడెం, ముస్తాబాద గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష క్యాంపులు జరిగాయి. ఎంపీపీ పాల్గొని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన ప్రతి ఇంటికీ మేలు చేశారన్నారు. అర్హులందరికీ పథకాలు అందజేశారని చెప్పారు. అర్హత మాత్రమే ప్రామాణికంగా పాలన చేసిన ఘనత సీఎంకు చెందుతుందన్నారు. తహసీల్దారు సీహెచ్ నరసింహారావు, జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ ఎండీ గౌసాని, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఏఎస్సార్ కోటేశ్వరరావు, ఆర్ఐ ఉదయ్, పంచాయతీ కార్యదర్శి కోట సురేష్‌బాబు, సచివాలయం కార్యదర్శి రాజశేఖర్, సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న, వీఆర్వో పి.అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాతపాడులో జగనన్న సురక్ష

పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని గ్రామ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు. ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు కంకిపాడు-3 సచివాలయంలో జగనన్న సురక్ష

కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడు-3 సచివాలయంలో ఈనెల 18న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయభాస్కర్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వారం రోజులు పాటు సచివాలయం పరిధిలో వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించి సమస్యలను గుర్తించారన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను గ్రామసభలో అందిస్తారన్నారు. సభను విజయవంతం చేయాలని కోరారు.

సంక్షేమ పాలనలో ప్రజా జీవితాల్లో వెలుగు



ఉయ్యూరు 18వ వార్డులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: సంక్షేమ పాలనలో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించి సంక్షేమ బ్రోచర్లను అందించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు టిడ్కో గృహాల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని కోరారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ సీఎం జగనన్న అర్హతే కొలమానంగా పథకాలను అందిస్తూ ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుస్తున్నారన్నారు. ఉయ్యూరు పట్టణంలో టిడ్కో గృహాల సమస్యను సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు అర్షతున్నీసాబేగం, సోలే సురేష్‌బాబు, వార్డు కౌన్సిలర్ నూర్జహాన్ బేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజులపాటి రామచంద్రరావు, అబ్దుల్ సద్దాం, బిస్మిల్లా ఖాన్, అహ్మద్‌ఖాన్, షేక్ అబూకలాం, ఎండీ అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర నారుమడితోనే అధిక పంట దిగుబడి



ఆరుగొలనులో వరి నారుమడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఆరోగ్యకరమైన నారు సాగు ద్వారానే వరిపంటలో అధిక దిగుబడి సాధ్యమని మండల వ్యవసాయాధికారి జొన్నల గడ్డ భవాని అన్నారు. బాపులపాడు మండలం ఆరుగొలనులో సోమవారం వరిపంటలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్యకరమైన నారు పెంచేందుకు పలు సూచనలు రైతులకు అందించారు. నారుమడిని 10-12 రోజుల వ్యవధిలో మూడు దఫాలు దమ్ము చేసి చదును చేయాలని సూచించారు. ఐదు సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలని ఏవో భవాని చెప్పారు. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదుకిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలని చెప్పారు. గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు, గ్రామ ఉద్యాన అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో రాయితీపై కందిపప్పు విక్రయాలు



రాయితీపై కందిపప్పు అందజేస్తున్న రైతుబజార్ సిబ్బంది

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక రైతుబజార్‌లో రాయితీపై కందిపప్పు విక్రయాలు ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.160 నుంచి రూ.200 వరకు పలుకుతుండడంతో పౌరసరఫరాల శాఖ ద్వారా రైతుబజార్‌లో కేవలం రూ.125కే విక్రయిస్తున్నారు. ఈ మేరకు సోమవారం స్టాల్ నెం 65లోని కృష్ణాజిల్లా కోఆపరేటివ్ స్టోర్ ద్వారా రాయితీపై కందిపప్పు విక్రయాలను చేపట్టారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటర్ల జాబితా సవరణకు చర్యలు

ఆర్డీవో విజయ్‌కుమార్



పెనమలూరులో రాజకీయ నేతలతో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో విజయ్‌కుమార్

పెనమలూరు: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు సవరణ జాబితా- 2024 కార్యక్రమం చేపట్టామని ఆర్డీవో ఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పెనమలూరు నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీ నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సరి చేయటానికి బూత్‌లెవల్ అధికారులు ప్రతి ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారన్నారు. సేకరించిన వివరాలతో తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందిస్తామని వివరించారు. బూత్‌లెవల్ అధికారులు వివరాలు సేకరించే సమయంలో అందరి సహకారం కావాలని సూచించారు. 1.1.2024 సంవత్సరం నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తికి ఓటు నమోదు చేస్తామని తెలిపారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సవరణకు తగిన ఫారాలతో ఓటరు ద్వారా సవరిస్తామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో చేరేందుకు ముందుకు రావాలి



ఎన్‌సీసీ విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేసిన శ్రీనివాసరెడ్డి, డాక్టర్ అప్పారావు, లక్ష్మణ్ కుందన్

మైలవరం: విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు ముందుకు రావాలని ఎన్‌సీసీ అధికారులు లక్ష్మణ్, కుందన్ పేర్కొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ తృతీయ, ఫైనల్ ఇయర్ 10 మంది విద్యార్థినులకు కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు లక్ష్మణ్, కుందన్, ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు సమక్షంలో సీ సర్టిఫికెట్లను సోమవారం అందజేశారు. కుందన్, లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విభాగం ద్వారా రక్షణ దళంలో, దేశ సరిహద్దులలో పురుషులతో పాటు మహిళలకు కూడా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థినులకు ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి చాలా సులభతరం అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆర్.పవిత్ర పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి సహకరించండి

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్ వినతి



సీఈఓ శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ (పీఎంఎఫ్ఎంఈ) పథకం ద్వారా విశ్వబ్రాహ్మణ మహిళలు ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ల ద్వారా చిరు వ్యాపారాలు చేసుకుని ఉపాధి పొందేలా ప్రోత్సహించాలని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రోసెసింగ్ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎల్. శ్రీధర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఫుడ్ వ్యాపార యూనిట్లు పెట్టుకునేందుకు జిల్లా హార్టీకల్చర్ అధికారులు, అలాగే అవగాహన కల్పించేందుకు రిసోర్స్ పర్సన్స్ అన్ని మండలాల్లో అందుబాటులో ఉన్నారని, వారిని సంప్రదిస్తే తగిన సహాయ సహకారాలను అందిస్తారని చెప్పారు. పూర్తి ఉచితంగా ప్రోసెస్ చేసే ఈ పథకం ఎంతో ప్రయోజనకరమని, ప్రాజెక్ట్ వ్యయంలో 90 శాతం బ్యాంక్ రుణ సౌకర్యం ఉందని, అందులో 35 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్కూల్ బస్‌లు నియమిత వేగంతో నడపాలి



మైలవరం: స్కూల్, కళాశాలల బస్ డ్రైవర్లు విధిగా యూనిఫామ్ ధరించాలని, నియమిత వేగంతో మాత్రమే వాహనాలు నడపాలని ఏసీపీ ఎం.రమేష్ పేర్కొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమావేశ హాలులో మైలవరం పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో మైలవరం, రెడ్డిగూడెం, రెడ్డిగూడెం మండలాల పాఠశాలలు, కళాశాలల బస్ డ్రైవర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. రోడ్డు, విద్యార్థి భద్రత అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమిత సంఖ్యలోనే విద్యార్థులను వాహనంలో అనుమతించాలన్నారు. మద్యం, ఇతర మత్తు పదార్థాల తాగి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ రూల్స్, రెగ్యులేషన్స్ పాటించాలని తెలిపారు. స్కూల్, కళాశాల బస్‌లలో డ్రైవర్‌కు తోడుగా మరో వ్యక్తిని నియమించాలని తెలిపారు. లైసెన్స్ కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించాలని, వారిపై ఎటువంటి క్రిమినల్ కేసులు లేకుండా చూడాలన్నారు. అనంతరం పై నిబంధనలు పాటిస్తామని డ్రైవర్లతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఐ మోహన్ రెడ్డి, మూడు మండలాల ఎస్సైలు హరిప్రసాద్, ధర్మరాజు, శ్రీను పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో ఆర్.నారాయణమూర్తి సందడి



పేటలో విద్యార్థులు, అధ్యాపకులతో సినీ హీరో ఆర్.నారాయణమూర్తి

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో సోమవారం ఆర్.నారాయణమూర్తి పర్యటించారు. సెప్టెంబర్ 2వ తేదీన రిలీజ్ కానున్న యూనివర్సిటీ అనే చిత్రాన్ని ప్రతి విద్యార్థి తప్పక చూడాలని కళాశాలలను సందర్శించి విద్యార్థులకు తెలియజేసేందుకు జగ్గయ్యపేట వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థలో జరుగుతున్న దోపిడీ విధానాలు, పేపర్ లీకేజీలు వంటి ప్రధాన అంశాలపై చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలిపారు. సొంత వాహనం కూడా లేకుండా ఆయన బస్సు ప్రయాణంలో జగ్గయ్యపేటకు వచ్చి తిరగడంతో విద్యార్థులు, కళాశాలల అధ్యాపకులు ఆశ్చర్యంగా చూశారు.

విలక్షణ నటుడు రంగనాథ్



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఒక హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రంగనాథ్ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్నారని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్. రామకృష్ణప్రసాద్ అన్నారు. దుర్గాపురం అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలో సోమవారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ప్రముఖ సినీ నటుడు, సాహితీవేత్త, దర్శకులు రంగనాథ్ 74 వ జయంతి నిర్వహించారు. రంగనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. వసంతకుమార్ మాట్లాడుతూ సినీనటుడు రంగనాథ్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. సొసైటీ కార్యదర్శి రాము, పి.విల్సన్ రాజు, షఫీ, నాగ మల్లిక, నాగేశ్వర రావు, కోటేశ్వర రావు, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు ప్రభుత్వం ప్రాధాన్యం



కంకిపాడు: కంటి వెలుగుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడు సచివాలయంలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 120 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించినట్టు తెలిపారు. దృష్టిలోపాలు ఉన్న వారిని గుర్తించి కళ్లజోళ్లు, శస్త్రచికిత్సలకు సిఫారసు చేస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్‌కుమార్, డీఓఏ చందన, ఎంఎల్‌హెచ్‌పీ శివదుర్గ, ఏఎన్ఎం మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆషాఢ మాస అమావాస్యను పురస్కరించుకుని సోమవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమగుండం వద్ద వేద పండితుల ఆధ్వర్యంలో చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రజలంతా సుఖంగా ఉండాలని, పాడి పంటలు సంవృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ నిర్వహించిన ఈ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

టూ వీలర్ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడిగా రవికుమార్

గన్నవరం: స్టార్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ గన్నవరం శాఖ అధ్యక్షుడిగా వెంగళ రవికుమార్ ఎన్నికయ్యారు. స్థానిక కొత్తపేటలో సోమవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాయినేని ధర్మా నేతృత్వంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా సగ్గుర్తి సుబ్బారావు, కార్యదర్శిగా షేక్ రఫీ, కోశాధికారిగా వెంగళ వెంకన్నబాబు ఎన్నికయ్యారు. జిల్లా ప్రచార కార్యదర్శి పీఎస్ ఖాన్ మాట్లాడుతూ కొత్తగా మార్కెట్‌లోకి వస్తున్న బీఎస్ 6 వాహనాల మెకానిక్‌పై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నబీఘోరి, జిల్లా గౌరవ అధ్యక్షుడు అంకాల సుబ్బారావు, అధ్యక్షుడు ఎండీ అక్బర్‌బాషా, ప్రధాన కార్యదర్శి ముక్తి వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి షేక్ జానీ, కోశాధికారి ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ



మైలవరం: మైలవరం వ్యవసాయ మార్కెట్ యార్డులోని రేషన్ బియ్యం మెయిన్ లిఫ్టింగ్ పాయింట్‌ను ఎన్టీఆర్ జిల్లా సబ్ కలెక్టర్ అదితిసింగ్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అదితి సింగ్ రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. రికార్డులు తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ వెంట మైలవరం తహసీల్దారు శ్రీనివాస్, డీటీ, సివిల్ సప్లైస్ మాధవి ఉన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

పాతపాడు(విజయవాడరూరల్): హైదరాబాద్‌లో వచ్చే నెలలో నిర్వహించతలపెట్టిన విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ విజ్ఞప్తి చేశారు. విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ తలపెట్టిన సన్నాహక సభ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రాత్రి పాతపాడు గ్రామంలో సభ జరిగింది. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ బీజేపీ అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదిస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ఏబీసీడీ వర్గీకరణకు బిల్లు ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జాతీయ ప్రధాన కార్యదర్శి మందా వెంకటేశ్వరరావు, కోటా దానియేలు, లింగాల నరసింహ, అయినంపూడి ఆశీర్వాదం, స్టేట్ మహిళా అధ్యక్షురాలు సుజాత, గన్నవరం నియోజకవర్గం ఇన్‌చార్జి మంద వేణుమాదిగ తదితరులు పాల్గొన్నారు.